
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 15 జూలై 2024



నేటి నుంచి టెక్కలి-భావనపాడు బస్సు ప్రారంభం

సంతబొమ్మాళి, జూలై 14: టెక్కలి-భావనపాడు బస్సు సర్వీసు సోమవారం నుంచి పునఃప్రారంభం కానుంది. గతంలో ఈ బస్సు సేవలను వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిపివేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సు సేవలు పునరుద్ధరించేలా మంత్రి అచ్చెన్నాయుడు చర్యలు చేపట్టారు. ఈ మేరకు టెక్కలిలో ఉదయం 7గంటలకు బస్సు బయలుదేరి 7.45కు భావనపాడు చేరుకుంటుంది. మళ్లీ 8గంటలకు బయలుదేరి 9గంటలకు టెక్కలి చేరుకుటుంది. అలాగే సాయంత్రం 4.30కి టెక్కలిలో బయలు దేరుతుంది. తిరిగి భావనపాడులో రాత్రి 6 గంటలకు బస్సు బయలుదేరి.. 7 గంటలకు టెక్కలి చేరుకుంటుంది.

తగ్గుబడి!

- బోసిపోతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు
- గతేడాది కన్నా తగ్గిన 15,391 మంది విద్యార్థుల సంఖ్య
- వైసీపీ విధానాలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం
- పాఠశాలల విలీనంపై తల్లిదండ్రుల్లో అసహనం

- నరసన్నపేట మండలం కరగాం పంచాయతీలోని పెద్దకరగాంలో నాలుగేళ్ల కిందట విద్యార్థులు లేక ప్రాథమిక పాఠశాలను మూసివేశారు.
- నరసన్నపేటలోని పోలీసుస్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే అభ్యసిస్తున్నారు. ఒకప్పుడు ఎంతోమంది విద్యార్థులతో ఈ పాఠశాల కళకళలాడేది. ప్రస్తుతం విద్యార్థులు లేక బోసిపోతోంది.
- ...ఇలా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. గత ప్రభుత్వం జీవో నెంబర్ 117తో ప్రాథమిక పాఠశాలల విలీనం చేసింది. మూడో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో కలిపేసింది. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేక నిర్వీర్యమవుతున్నాయి. ఈక్రమంలో కొన్ని పాఠశాలలు మూతపడుతున్నాయి.



విద్యార్థుల సంఖ్య ఇలా..

తరగతి	గతేడాది	ఈ ఏడాది
ఒకటి	23,901	19,952
రెండు	23,221	22,995
మూడు	24,945	22,334
నాలుగు	29,428	24,106
ఐదు	31,357	28,074
మొత్తం	1,32,852	1,17,461

(నరసన్నపేట)

వైసీపీ ప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థ గాడి తప్పింది. అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో గత ఐదేళ్లలో ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. జిల్లాలో మొత్తం 1,915 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో గతేడాది 1,32,852 మంది విద్యార్థులు చదువుకున్నారు. ఈ ఏడాది 1,17,461 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఒక్క ఏడాదే 15,391 మంది విద్యార్థుల సంఖ్య తగ్గింది. జిల్లాలో పది మంది విద్యార్థులు కన్నా తక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలలు 350కుపైగా ఉన్నాయి.

- గత వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందట పాఠశాలల విలీనానికి జీవోనెంబర్ 117 జారీ చేసింది. ఈ జీవో మేరకు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న మూడు నుంచి ఐదోతరగతి విద్యార్థులను ఉన్నత పాఠశాల, యూపీ పాఠశాలల్లో విలీనం చేశారు. జిల్లాలో మొత్తం 244 ప్రాథమిక ఉన్నత పాఠశాలలను విలీనం చేశారు. వీటిలో ప్రభుత్వ పాఠశాల ఒకటి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు 192, మునిసిపాలిటీలో ఉన్న 13 పాఠశాలలు ఉన్నత పాఠశాలల్లో విలీనమయ్యాయి. 18 పాఠశాలలు యూపీ పాఠశాలల్లో కలిపేశారు. అప్పట్లో విద్యాసంవత్సరం మధ్యలో విలీనం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. విలీనం చేయొద్దంటూ తల్లిదండ్రులు కూడా ఆందోళన చేపట్టారు. అయినా గత ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి చాలా మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు లేకపోవడం.. అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నా నాణ్యమైన విద్య అందడం లేదని పలువురు పేర్కొంటున్నారు. పాఠశాలల విలీనంతో ఒకటి, రెండు తరగతుల్లో విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉండడంతో.. బోధన సక్రమంగా సాగుతుందో లేదోనని కొందరు సందేహం పడుతున్నారు. ఈ క్రమంలో ఆర్థిక భారమైనా సరే.. ప్రైవేటు పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.


మెళియాపుట్టి మార్కెట్ స్థలంలో వదిలేసిన పైపులు

నీరుగారిన.. జలజీవన్!

- ఎక్కడికక్కడే నిలిచిన పనులు
- కాంట్రాక్టర్లకు చెల్లించని బిల్లులు
- ప్రజలకు తప్పని తాగునీటి ఇక్కట్లు

(మెళియాపుట్టి)

ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్న వైసీపీ నేతల హామీలు.. ప్రకటనలకే పరిమితమయ్యాయి. జలజీవన్ మిషన్ పథకం ద్వారా కేంద్రం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. గత వైసీపీ ప్రభుత్వం వాటిని దారి మళ్లించింది. గ్రామీణ ప్రజలకు తాగునీటి వసతి కల్పించేందుకు కనీసం శ్రద్ధ లేదు. కొంతమంది కాంట్రాక్టర్లు పనులు చేపట్టగా.. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపేశారు. గత ఐదేళ్లలో జిల్లాలో 30 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల గ్రామాల్లో గుంతలు తీసి.. పైపులు వేసి వదిలేశారు. నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలో జలజీవన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 2,284 పనులకు సంబంధించి రూ.477.76 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాగా.. నీటి సరఫరాకు అవసరమైన రక్షితనీటి పథకాలు లేకపోవడంతో కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి. కొన్నిచోట్ల టెండర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. తొలివిడత రూ.301 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఫలితంగా ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు.

- జిల్లాలో 38 సమగ్ర రక్షితనీటి పథకాలు, 1075 రక్షిత నీటిపథకాలు, 205 చిన్న రక్షిత నీటి పథకాలు, 440 డైరెక్టర్ పంపింగ్ పథకాలు, 16,201 చేతిపంపులు, 32 ఎన్టీఆర్ సుజల పథకాలు ఉన్నాయి. వీటిలో చాలా రక్షితనీటి పథకాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గత ఐదేళ్లలో కనీసస్థాయిలో మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. మెళియాపుట్టి మండలంలో జగన్నాథపురం, గంగరాజపురం, జలగలింగుపురం, బందపల్లి తదితర గ్రామాల్లో గతంలో బాగా పనిచేస్తున్న రక్షిత నీటి పథకాలను మరమ్మతుల పేరిట తొలగించేశారు. కొత్త కుళాయిలు ఏర్పాటు చేసినా నీరు ఇవ్వలేని పరిస్థితి కనిపిస్తోంది. హిరమండలం వంశధార ప్రాజెక్టు నుంచి వచ్చిన నీటిని.. పాతపట్నం నియోజకవర్గానికి ఇచ్చేందుకు రూ.265 కోట్ల మేర నిధులు మంజూరు చేస్తామని గతంలో మాజీ సీఎం జగన్ హామీ ఇచ్చారు. కానీ, నిధులు మంజూరు చేయక.. ఇంతవరకూ పనులు ప్రారంభించలేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్పందించి.. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని జిల్లావాసులు కోరుతున్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై.. మెళియాపుట్టి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్ వద్ద ప్రస్తావించగా.. జల్‌జీవన్ ద్వారా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో.. ప్రస్తుతం ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొందన్నారు. బిల్లుల బకాయిల జాబితా ప్రస్తుత ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు.


బందపల్లిలో పైపులు ఇలా..


జగన్నాథపురంలో నిరుపయోగంగా కుళాయి పైపులు



కృష్ణావతారంలో జగన్నాథుడు

- నేడు మారు రథయాత్ర

జిల్లాలో రథయాత్ర ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శ్రీకాకుళం మొండేటి వీధిలోని శ్రీ లలిత సహిత శివకామేశ్వర స్వామి ఆలయం, శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం ఆవరణలో శ్రీ జగన్నాథస్వామి ఆదివారం కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. అలాగే ఇలిసిపురంలోని జగన్నాథాలయంలో స్వామిని ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఒడిశా సంప్రదాయం ప్రకారం సోమవారం సాయంత్రం మారు రథయాత్ర నిర్వహించనున్నట్టు బాలు పాణిగ్రాహీ తెలిపారు.

- శ్రీకాకుళం కల్చరల్


థర్మల్ అమరవీరులకు నివాళులు..

గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు పాటించాలి

- థర్మల్ పోరాట మృతులకు నివాళి

సోంపేట, జూలై 14: సోంపేట బీల ప్రాంతంలో ఉన్న చిత్తడి నేలలను గుర్తించాలని, గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును పాటించాలని మానవ హక్కుల కన్వీనర్ వీఎస్ కృష్ణ, పర్యావరణ పరిరక్షణసమితి అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి కోరారు. 14వ సంస్మరణ దినం సందర్భంగా థర్మల్ పోరాట మృతులకు ఆదివారం నివాళులు అర్పించి.. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. థర్మల్ పోరాటంలో పాల్గొన్న వారిపై 56 కేసులు నమోదు చేశారని, ఇందులో 55 కేసులు కొట్టి వేసినట్లు చెప్పారు. మిగిలిన కేసు కూడా కొట్టివేయాలని కోరారు. 329 జీవోతో ప్రమాదం పొంచి ఉందని, దీని రద్దు కోసం పోరాడుతామన్నారు. పర్యావరణాన్ని కాపాడే విషయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముందుంటారని జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ తెలిపారు. థర్మల్ ఉద్యమంలో ఇంకా మిగిలి ఉన్న కేసు విషయాన్ని పవన్ దృష్టికి తీసుకెళ్లి దాన్ని ఎత్తివేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు డోల జగన్, మాజీ జడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్, జనసేన సమన్వయకర్త దాసరి రాజు, పరిరక్షణ సమితి ప్రతినిధులు ప్రధాన శివాజీ, జేవీ రత్నం, కేవీ జగన్నాథరావు, తమ్మినేని రామారావు, సనపల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఈ-పంట'పై అయోమయం

- నమోదుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఆందోళనలో రైతులు

(ఇచ్ఛాపురం)

జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో.. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. సుమారు రెండు లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయనున్నారు. ప్రభుత్వం ఏటా ప్రారంభ దశలోనే ఈ-క్రాప్ నమోదు చేయించేది. విపత్తు సమయంలో రైతులకు పరిహారం అందజేసేలా చర్యలు చేపట్టేది. కాగా.. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఈ-క్రాప్‌పై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై స్థానిక వ్యవసాయశాఖ సిబ్బందిని ఆరా తీస్తున్నా సరైన సమాధానం రాకపోవటంతో దిగులు చెందుతున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈక్రాప్ ప్రక్రియను నిర్వహించేవారు. పొలం వద్ద రైతులను నిలబెట్టి పంటతో పాటు ఫొటో తీసి యాప్‌లో వివరాలు నమోదు చేసేవారు. ఈ-కాఫ్ ఆధారంగానే ఎరువులు ఇతర సాగుసాయాన్ని వ్యవసాయ సిబ్బంది అందించేవారు. రైతులు పండించిన పంటను ఈక్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది. ఈ పంట నమోదుతో పంటల బీమా వర్తింపజేసేది. పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి అందజేసేది. కాగా.. ప్రస్తుతం ఈ-క్రాఫ్ ఇప్పటికీ ప్రారంభించకపోతే ఎలా అని రైతులు అయోమయం చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఈ క్రాఫ్ నమోదుపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే పెట్టుబడి సాయం అందించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయశాఖ ఏడీ శ్రీధర్ వద్ద ప్రస్తావించగా.. ఈ క్రాఫ్ నమోదుకు ఇంకా సమయం ఉందని తెలిపారు. పూర్తిస్థాయిలో విత్తనాల ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఈక్రాఫ్ నమోదు చేపడతామన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో రాయితీ, నష్టపరిహారం అందుతుందని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.




హిరమండలం వద్ద వంశధార కుడి కాలువలో గుర్రపు డెక్కను తొలగిస్తున్న వేతనదారులు


పూడికలు తొలగించడంతో కొత్త కళ సంతరించుకున్న వంశధార కాలువ

కాలువలు.. కళకళ

- యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు
- కొత్తరూపు సంతరించుకున్న 'వంశధార'

(హిరమండలం)

కాలువలు కొత్తకళను సంతరించుకుంటున్నాయి. వైసీపీ పాలనలో కనీస నిర్వహణ లేక జలవనరులు నిర్వీర్యమయ్యాయి. ప్రాజెక్టుల్లో నీరున్నా కాలువలకు మరమ్మతులు విస్మరించడం.. పూడికలు తొలగించకపోవడంతో ఆయకట్టుకు నీరందడం గగనమైంది. అధిక నీటి ప్రవాహానికి కాలువ గట్లకు గండ్లు పడుతుండేవి. షట్టర్లు తుప్పుపట్టాయి. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం సాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించింది. తక్షణమే పూడికలు తొలగించేలా నిధులు మంజూరు చేసింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అధికారులు కాలువల్లో పూడికలు తొలగించి.. సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

- జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రధానంగా వంశధార ప్రాజెక్టుపై ఆధారపడి ఉంది. గొట్టాబ్యారేజి కుడి, ఎడమ కాలువల ద్వారా పుష్కలంగా నీరు ప్రవహిస్తే.. వర్షాలు లేకపోయినా పంటలకు నీటి సమస్య పెద్దగా ఉండదు. వంశధార ఎడమ కాలువ ద్వారా.. హిరమండలం, సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస మండలాల్లో 398గ్రామాల్లోని 1,48,200 ఎకరాల ఆయకట్టు ఉంది. కుడి కాలువ పరిధిలోని హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆముదాలవలస, శ్రీకాకుళం, గార, బూర్జ మండలాల్లోని 82వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కాగా.. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు ఈ కాలువల ఆధునికీకరణ, మరమ్మతులు పట్టించుకోలేదు. దీంతో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు, పూడికతో నిండి.. కాలువల అధ్వానంగా మారాయి. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరందక రైతులు వేలాది ఎకరాల్లో పంట నష్టపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు సాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాలో వంశధార కాలువలు అభివృద్ధికి చొరవ చూపారు. ఆయకట్టుకు సక్రమంగా సాగునీరందించేలా చర్యలు చేపట్టారు. కుడి, ఎడమ కాలువల పరిధిలో పూడికలు, గుర్రపుడెక్క తొలగించేందుకు కలెక్టర్ ద్వారా రూ.45లక్షలు నిధులు విడుదల చేశారు. జలవనరుల శాఖ నుంచి మరో రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు గత రెండు వారాలుగా కాలువలను శుభ్రం చేస్తున్నారు. మరోవైపు కాలువల అభివృద్ధికి ఎస్ఆర్ఈజీఎస్ నిధులను కూడా ఉపయోగించుకుంటున్నారు. ఉపాధి వేతనాదారులతో పనులు చేపడుతున్నారు. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. ఈక్రమంలో గొట్టాబ్యారేజీ కుడి, ఎడమ కాలువలు కొత్తరూపు సంతరించుకున్నాయి.

రైతులకు ఇబ్బంది లేకుండా..


వంశధార కాలువల ద్వారా శివారు ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరందేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఎడమ కాలువ ద్వారా పలాస వరకు సాగునీరు చేరింది. కుడి ప్రధాన కాలువల్లో కూడా పనులు పూర్తిచేసి.. రెండురోజుల్లో నీటిని విడుదల చేస్తాం.

-ఎస్ఈ వి.రాంబాబు, ఎస్ఈ, వంశధార ప్రాజెక్టు

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023



కొత్త క్రిమినల్ చట్టాలు

కొత్త దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏళ్ల పైమాటే అయినా ఇంకా వలస పాలన కాలం నాటి వందేళ్లకు పైగా పాతదైన పురాతన శిక్షా స్మృతులనే భారతదేశం అనుసరిస్తోంది. నేరాలు సంతరించుకున్న ఆధునిక రూపును న్యాయవ్యవస్థ అందుకోలేకపోవడంతో ఫిర్యాదులు, సాక్ష్యాధారాల సేకరణ, నేర విచారణల్లో జాప్యం అనివార్యమౌతోంది. 'జస్టిస్ డిలేయ్‌డ్ ఈజ్, జస్టిస్ డినైడ్' (న్యాయం ఆలస్యమవడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే) అని లోకోక్తి. అందుకే పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మారాల్సి ఉంది. ఈ కోవలోనే క్రిమినల్ నేరాలకు సంబంధించిన మూడు ప్రధాన చట్టాలైన

- 'ఇండియన్ పీనల్ కోడ్'(భారతీయ శిక్షాస్మృతి),
- 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'(నేర విచారణ స్మృతి),
- 'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్'(భారతీయ సాక్ష్యాధార చట్టం)లను పూర్తిగా సంస్కరించారు.

వీటిని ఆధునిక పేర్లతో 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తేదీ తరవాత జరిగిన అన్ని నేరాలకు ఈ నూతన చట్టాలు వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఆ చట్టాల్లో తెచ్చిన స్థూలమైన మార్పులకు సంబంధించిన ప్రధానాంశాలపై అవగాహన తప్పనిసరి.

ఇది ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో వచ్చిన అధునాతన చట్టం. గతంలో ఐపీసీలో 511 సెక్షన్‌లు ఉండగా ప్రస్తుతం బీఎన్ఎస్‌లో 356 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం 175 పాత సెక్షన్‌లను మార్చి 8 కొత్త సెక్షన్‌లు ప్రవేశపెట్టారు. 22 సెక్షన్లను సమూలంగా రద్దు చేశారు.

కీలకాంశాలు

బీఎన్ఎస్ ప్రకారం 'మూకదాడి'ని ఒక శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ విపులీకరించారు. అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది జాతి, మత, వర్గ తదితర ప్రాతిపదికల మీద విద్వేషపూరిత హత్య లేదా తీవ్రంగా గాయపరచినపుడు దానిని మూకదాడిగా పరిగణిస్తూ జీవితఖైదు లేదా మరణ శిక్ష విధిస్తారు.

రాజద్రోహం అనే నేరాన్ని శిక్షాస్మృతి నుంచి రద్దు చేసి 'దేశద్రోహం'అనే నేరాన్ని విశదీకరించి శిక్షార్హం చేశారు. టెర్రరిజం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడడం, అటువంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం; దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, భద్రత, సమగ్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను దేశ ద్రోహంగా పరిగణిస్తారు.

పద్దెనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో జరిపిన లైంగిక చర్యను ఆమె అంగీకారం ఉన్నప్పటికీ, వివాహిత అయినప్పటికీ లైంగికదాడిగానే పరిగణిస్తారు. దీనిని శిక్షార్హమైన నేరంగా సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారానికి మరణదండన విధించవచ్చు.

నిజాలు దాచి వివాహం చేసుకోవడం, మభ్యపెట్టడం; ఉద్యోగం, ప్రమోషన్ వంటి ప్రలోభాలతో లొంగదీసుకొని లైంగికచర్య జరపడం వంటివాటిని నేరాలుగా పరిగణిస్తూ పదేళ్లవరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

స్నాచింగ్(బలవంతంగా లాక్కొనిపోవడం)ను దొంగతనంలో భాగంగా చూడడానికి బదులు ప్రత్యేక నేరంగా పరిగణిస్తూ ఈ శిక్షాస్మృతిలో చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు అనే ప్రత్యేక విభాగంలోకి కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, దోపిడీలు, భూకబ్జాలు, కాంట్రాక్ట్ హత్యలు, వాహనాల చోరీ వంటివాటిని చేర్చారు. నేర తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు.

ప్రభుత్వాధికారుల విధి నిర్వహణకు అడ్డుపడే నిమిత్తం చేసిన ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి కొన్ని స్వల్ప నేరాలకు 'సామాజిక సేవ'ను శిక్షగా విధించడం వంటి వినూత్న అంశాలను నూతన న్యాయస్మృతిలో చేర్చారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల మరణానికి కారణమవడం కూడా శిక్షార్హనేరంగా పరిగణించారు. ఈ నేరానికి రెండు నుంచి అయిదేళ్ల వరకు అదే వైద్యులకైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. తప్పుదోవ పట్టించే లేదా అసత్య వార్తలను ప్రచురించడం కూడా శిక్షార్హ నేరంగా సూచించారు. కొన్ని సెక్షన్లను బాలలకు సంబంధించిన అంశాలున్నవాటిని లింగ సమానత్వం దృష్ట్యా అన్ని లైంగికవర్గాలకు వర్తించేలా సవరించారు. అసహజ లైంగిక చర్య నిర్వచనం నుంచి 'స్వలింగ సంపర్కం'ను తొలగించి, నేరం కాదని తీర్మానించింది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

విమర్శలు

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో బాలలు అంటే పద్దెనిమిదేళ్లలోపు వారిగా నిర్వచించడం వల్ల కొన్ని సెక్షన్ల అమలులో సందిగ్ధత తలెత్తనుంది. ఉదాహరణకు అత్యాచారం, సామూహిక అత్యాచారం వంటి అంశాల్లో వయో వ్యవధుల పరంగా సెక్షన్ల మధ్య సంఘర్షణ ఏర్పడవచ్చు.
- జస్టిస్ వర్మ కమిటీ సూచించిన విధంగా అత్యాచారాన్ని జెండర్ న్యూట్రల్(లింగసమానత)గా పరిగణించడం, మ్యారిటల్ రేప్‌ను నేరంగా సూచించడం వంటి అంశాలను నూతన న్యాయ సంహిత విస్మరించిందని; అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి పాత ఐపీసీలోని అంశాలనే కొనసాగించారనీ పలు వర్గాలు విమర్శిస్తున్నాయి.
- క్రిమినల్ రెస్పాన్సిబిలిటీ ఏజ్ అంటే ఒక చర్య నేరం అని గ్రహించే వయసును ఏడేళ్లుగా, మానసిక పరిపక్వత ఆధారంగా పన్నెండేళ్ల వరకూ పరిగణించే విధంగా నిర్ణయించడం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రమాణాలతో విభేదించేలా ఉంది.
- కొన్ని సెక్షన్లలో తప్పనిసరి కనీస శిక్షను నిర్ణయించారు. ఇది న్యాయమూర్తుల విచక్షణాయుత తీర్పులకు ఆటంకం కావచ్చు.
- కమ్యూనిటీ సర్వీస్(సామాజిక సేవ)ను కొన్ని స్వల్ప తప్పిదాలకు శిక్షగా నిర్ధారించారు. అయితే ఒక చట్టం శిక్షల పరంగా ప్రతి అంశాన్నీ కూలంకశంగా వివరిస్తుంది. కానీ సామాజిక సేవ అంటే ఏంటో ఇతమిద్ధంగా ప్రస్తావించకపోవడం మాత్రం చట్టంలోని ప్రధాన లోపంగా చెప్పవచ్చు.
- క్లాజ్- 69లో మభ్యపెట్టడం, ప్రలోభపెట్టడం ద్వారా లైంగిక చర్య జరపడం అనే అంశం సహజీవనం, పరస్పర అంగీకారం వంటి సందర్భాల్లోనూ దుర్వినియోగమయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి.
- అనేక నేరాలకు మరణ శిక్ష ఉండడం కూడా పెద్ద ఎత్తున మానవ హక్కుల వర్గాల నుంచి, ప్రపంచవ్యాప్త హక్కుల సంస్థల నుంచి నిరసనలకు కారణమవుతోంది.
- వేర్పాటువాదం; దేశ సమగ్రతకు, ఐక్యతకు, భద్రతకు భంగం కలిగించడం వంటి దేశద్రోహ నిర్వచన అంశాలు ప్రత్యేక రాష్ట్రాల వాదనలను, హక్కుల కోసం జరిపే నిరసనలను కూడా ఈ నేరపరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

దిశలు - దూరాలు

రీజనింగ్

పార్ట్-2

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం


ముఖ్యరేఖాచిత్రం

1. సుమ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లాలనుకున్నది. ఆమె తన ఇంటి నుంచి ఉత్తర దిశగా బయలుదేరింది. కొంత సమయం తరవాత ఎడమవైపునకు తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి పాఠశాలకు చేరుకున్నది. అయితే ఆమె ఇంటి నుంచి పాఠశాల ఏ దిశలో ఉంది?

ఎ) ఈశాన్యం బి) నైరుతి సి) ఆగ్నేయం డి) వాయువ్యం

సమాధానం: (డి)

వివరణ:




పై రేఖాచిత్రం ప్రకారం సుమ, ఇంటి నుంచి పాఠశాల వాయువ్య దిశలో ఉన్నదని తెలుస్తుంది.

2. 100 కి.మీ. పొడవు గల ఒక రోడ్డుపై రెండు కార్లు చెరొకవైపు నుంచి వ్యతిరేక దిశలలో ప్రయాణిస్తున్నాయి. మొదటికారు 20 కి.మీ. ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 10 కి.మీ. ప్రయాణించింది. తదుపరి ఎడమవైపు తిరిగి 20 కి.మీ. ప్రయాణించిన తదుపరి ఎడమవైపునకు తిరిగి ప్రధాన రహదారి కి చేరుకున్నది. రెండో కారు చిన్న లోపం వల్ల 15 కి.మీ. మాత్రమే ప్రయాణించి ఆగిపోయింది. అయితే ఇప్పుడు రెండు కార్ల మధ్య దూరం ఎంత?

ఎ) 35 కి.మీ. బి) 45 కి.మీ. సి) 30 కి.మీ. డి) 40 కి.మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రం ప్రకారం మొదటి కారు ప్రధాన రహదారికి చేరుకున్న తరవాత గమనించిన మొదటికారు ప్రధాన రహదారి పరంగా 40 కి.మీ. దూరాన్ని పూర్తి చేసుకున్నది. రెండో కారు అదే ప్రధాన రహదారి పరంగా మరొకవైపు నుంచి 15 కి.మీ. పూర్తి చేసినది. ఈ రెండింటిని కూడి మొత్తం నుంచి తీసివేస్తే రెండుకార్ల మధ్య దూరం తెలుస్తుంది.


100-(40+15) = 100-55=45 కి.మీ. సమాధానం అవుతుంది.

3. A, B, C, D, E అనే అయిదుగురు వ్యక్తులు ఒక వరుసలో నిల్చున్నారు. E అనే వ్యక్తి Bకి ఎడమవైపు 40మీ. దూరంలో ఉన్నాడు. A అనే వ్యక్తి Cకి ఎడమవైపు 20మీ. దూరంలో ఉన్నాడు. D అనే వ్యక్తి Eకి కుడివైపు 20మీ. దూరంలోను, Cకి కుడివైపు 50మీ. దూరంలోను ఉన్నాడు. అయితే A, Bల మధ్య దూరం ఎంత?

ఎ) 90 మీ. బి) 60 మీ. సి) 70 మీ. డి) 80 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:




పై వివరణ ఆధారంగా A, Bల మధ్య దూరం 90 మీ. అని తెలుస్తుంది.

4. ఒక బాలుడు సైకిల్‌పై తూర్పునకు కొంత దూరం ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 2 కి.మీ. ప్రయాణించాడు. తదుపరి మరల కుడివైపునకు తిరిగి 3 కి.మీ. ప్రయాణించాడు. ఇప్పుడు అతను బయలుదేరిన స్థానం నుంచి దక్షిణంగా కచ్చితంగా 2 కి.మీ. దూరంలో ఉన్నాడు. అయితే ఆ బాలుడు మొదట్లో తూర్పునకు ఎంతదూరం ప్రయాణించాడు?

ఎ) 2 కి.మీ. బి) 4 కి.మీ. సి) 3 కి.మీ. డి) 5 కి.మీ.

సమాధానం: (సి)

వివరణ:




బయలుదేరిన స్థానానికి, చేరుకున్న స్థానం 2 కి.మీ. దూరంలో దక్షిణాన ఉంది. కాబట్టి పై డయాగ్రామ్‌ను పరిశీలిస్తే ఆ బాలుడు సైకిల్‌పై మొదట్లో తూర్పునకు 3 కి.మీ. ప్రయాణించాడని తెలుస్తుంది.

5. ఆనంద్ మ్యూజియానికి వెళ్లాలనుకున్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు దక్షిణదిశలో ఉంది. ఆ రోడ్డు కూడలి లేదా చౌరస్తాకు వచ్చిన తరవాత కుడివైపున పాఠశాల, ఎడమవైపున ఆటస్థలం ఉన్నది. అయితే మ్యూజియం ఏ దిశలో ఉంది?

ఎ) తూర్పు బి) పడమర సి) దక్షిణం డి) ఉత్తరం

సమాధానం: (డి)

వివరణ:




ఇటువంటి ప్రశ్నలలో ముఖ్య దిశలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)లో మిగిలి ఉన్నదే సమాధానం అవుతుంది.

6. సూర్యోదయం తరవాత విక్రమ్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలుచున్నాడు. స్తంభం నీడ విక్రమ్‌కు కుడివైపున ఉన్నది అనుకుంటే విక్రమ్ ఇప్పుడు ఏ దిక్కును చూస్తూ నిలుచున్నాడు?

ఎ) పడమర బి) ఉత్తరం సి) తూర్పు డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ: నీడ ప్రశ్నల్లో గుర్తించుకోండి. నీడ ఎప్పుడైనా సరే సూర్యునికి వ్యతిరేక దిశలో ఉంటుంది. అంటే ఉదయం సూర్యుడు తూర్పున ఉంటారు కాబట్టి ఉదయం పూట ఏదైనా వస్తువు నీడ, వ్యక్తి నీడ చెట్టునీడ గాని మరే నీడైనా గాని పడమర ఉంటుంది. సాయంత్రం పూట సూర్యుడు పడమర వైపున ఉంటాడు. (అస్తమించే సమయంలో) కాబట్టి సాయంత్రం పూట ఏ నీడైనా తూర్పున ఉంటుంది. గుర్తుంచుకోండి నీడ సూర్యునికి వ్యతిరేకంగా ఉంటుంది.



ప్రశ్నలో నీడ విక్రమ్‌కు కుడివైపునకు ఉందని ఉన్నది. ఉదయంపూట కాబట్టి నీడ పడమరకు ఉంటుంది. దక్షిణ మునకు కుడివైపు పడమర అంటే విక్రమ్ దక్షిణానికి చూస్తూ నిలబడితే అతని కుడివైపు (పడమర) స్తంభం నీడ ఉందని అర్థం. విక్రమ్ కిందికి అనగా దక్షిణ దిక్కును చూస్తున్నాడు. ఇప్పుడు విక్రమ్‌కి కుడివైపు అంటే పడమర వైపు స్తంభం నీడ ఉంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

మోదీ @ 10 కోట్లు

'ఎక్స్'లో ప్రధానిని ఫాలో అవుతున్న వాళ్ల సంఖ్య

- ఒబామా తర్వాత అంతమంది అనుసరిస్తున్న నేత
- క్రీడాకారులు, సెలబ్రిటీల కంటే ఆయనకే క్రేజ్
- సంతోషం వ్యక్తం చేస్తూ స్వీయ పోస్టు

న్యూఢిల్లీ, జూలై 14: 10 కోట్లు! భారత ప్రధాని నరేంద్రమోదీని 'ఎక్స్'లో ఫాలో అవుతున్నవారి సంఖ్య ఇది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా(13 కోట్లు) తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న మరో నేతగా, ప్రభావవంతమైన వ్యక్తిగా మోదీ నిలిచారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పలువురు సెలబ్రిటీలు, క్రీడాకారుల కంటే మోదీనే 'ఎక్స్'లో ఎక్కువ మంది ఫాలో అవుతుండటం విశేషం. అలాగే తన రాజకీయ ప్రత్యర్థులైన రాహుల్‌గాంధీ(2.64 కోట్లు), అరవింద్ కేజ్రీవాల్(2.75 కోట్లు), అఖిలేశ్ యాదవ్(1.90 కోట్లు), మమతాబెనర్జీ(74 లక్షలు) వంటి వారి కంటే ఫాలోవర్స్ విషయంలో ఆయన అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. అదేవిధంగా ప్రముఖ క్రీడాకారులు విరాట్ కోహ్లి(6.4 కోట్లు), నేమర్ జూనియర్(6.3 కోట్లు), లెబ్రోన్ జేమ్స్(5.2 కోట్లు)లను అలాగే టేలర్ స్విఫ్ట్(9.5 కోట్లు), లేడీ గాగా(8.3 కోట్లు), కిమ్ కర్దాషియన్(7.52 కోట్లు) వంటి సెలబ్రిటీలను సైతం అధిగమించారు. 10 కోట్ల మార్క్ చేరుకున్న సందర్భంగా మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. చర్చోపచర్చలకు, విమర్శలకు, ప్రజల ఆశీర్వాదాలకు నిలయమైన ఇటువంటి చైతన్యవంతమైన మాధ్యమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందని పోస్టు చేశారు. కాగా, 2009లో 'ఎక్స్'లో ఖాతా తెరిచినప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ మాధ్యమాన్ని ఆయన బాగా ఉపయోగించుకున్నారు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను, సహచర మంత్రులను ఉత్తేజపరుస్తూ, విపత్తులు, శుభాశుభాలు చోటుచేసుకున్నప్పుడు స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు. గడిచిన మూడేళ్లలో సుమారు 30 కోట్ల మంది మోదీని 'ఎక్స్'లో ఫాలో అయ్యారు. ఇతర మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ లలో కూడా ఆయనను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం. యూట్యూబ్‌లో మోదీకి 2.5 కోట్ల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇన్‌స్టాలో ఆయన 10 కోట్ల ఫాలోవర్లకు చేరువలో ఉన్నారు.

లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా గౌరవ్ గొగోయ్

- స్పీకర్‌కు సీపీపీ చైర్‌పర్సన్ సోనియా లేఖ

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు ఆ పార్టీ మరోసారి అవకాశమిచ్చింది. చీఫ్ విప్‌గా సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్, విప్‌లుగా మాణిక్యం ఠాగూర్, మహమ్మద్ జావేద్‌లను నియమించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ లేఖ రాశారు. ఇదే విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు సురేశ్ (మావేలికర) కేరళ నుంచి 8 సార్లు ఎంపీగా గెలవగా.. మాణిక్యం ఠాగూర్ (విరుదునగర్) తమిళనాడు నుంచి 3 సార్లు, జావేద్ (కిషన్‌గంజ్) బిహార్ నుంచి 2 సార్లు గెలిచారు.

మణిపూర్‌లో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో జిరిబం జిల్లాలోని మోంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) జవాన్ మృతి చెందారు. దుండగులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరణించిన జవాన్‌ను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మరో పోలీసుకు గాయాలయ్యాయి. కుకీలకు చెందిన మిలిటెంట్లే ఈ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

తెరుచుకున్న జగన్నాథుడి రత్నభాండాగారం



ఖజానాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన చెక్కపెట్టెలు

- 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- రహస్య గదిలోకి ప్రవేశించిన 11మంది సభ్యులు
- ఖజానాను తరలించడానికి 6 చెక్కపెట్టెలు సిద్ధం
- బయటి గదిలోని సంపదను వాటిలోకి చేర్చి సీలు

పూరీ, జూలై 14: పూరీ క్షేత్రంలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఖజానా రత్నభాండాగారం 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకుంది. గది లోపల ఉన్న విలువైన వస్తువుల లెక్కింపుతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణానికి మరమ్మతులు చేయడానికి ఖజానాను తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో 128.380 కిలోల బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటల సమయంలో రహస్య గదిని తెరిచారు. జగన్నాథుడి ఖజానా తలుపులు తెరిచినట్లు ఒడిశా సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. నలుగురు ఆలయ సేవకులతో పాటు కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాధీ, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ డీబీ గడనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి సహా మొత్తం 11మంది సభ్యులు గదిలోకి ప్రవేశించారని అధికారులు పేర్కొన్నారు. రత్నభాండాగారం తలుపులు తెరవనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఉదయం గుండిచ మందిరంలో జగన్నాథ స్వామికి, ఆయన తోబుట్టువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనుమతి తీసుకున్నారు. పూరీలో రథయాత్ర సాగుతున్నందున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవి విగ్రహాలు ప్రస్తుతం గుండిచ ఆలయంలో ఉన్నాయి. వచ్చేవారం జరిగే బహుదా యాత్ర సందర్భంగా దేవతామూర్తులను తిరిగి శ్రీక్షేత్రానికి తీసుకొస్తారు. రహస్య గదిలో విషసర్పాలు నిధిని కాపలా కాస్తుంటాయన్న అనుమానాలతో ముందు జాగ్రత్తగా పాములు పట్టడంలో నిపుణులతో పాటు సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల, బయట రెండు స్నేక్ క్యాచర్ల బృందాలను సిద్ధంగా ఉంచామని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుభేందు మల్లిక్ తెలిపారు. అంతకుముందు ఎస్‌జేటీఏ చీఫ్ అరబింద పాధీ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖజానాను తెరిచినప్పటికీ విలువైన వస్తువుల లెక్కింపు ప్రక్రియను ఇప్పటికిప్పుడే చేపట్టబోమని చెప్పారు. స్వర్ణకారులు, ఇతర నిపుణుల నియామకం తర్వాతే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలుత రత్నభాండాగారం బయట, లోపలి గదుల్లో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో భద్రపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. ఖజానా నిర్మాణం భద్రతను నిర్ధారించడం తమ తొలి ప్రాధాన్యంగా చెప్పారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థకు చేరి ఉంటే ఆభరణాలను తరలించడానికి వీలుగా ఇత్తడి పూత పూసిన ఆరు చెక్క బాక్సులను సిద్ధంగా ఉంచారు. ఖజానా బయట గదిలో ఉన్న ఆభరణాలను ఈ కలప పెట్టెల్లోకి మార్చి సీలు వేసినట్లు తెలిపారు. బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోని బంగారం, వెండి సామగ్రిని కూడా తరలిస్తామని పాధీ పేర్కొన్నారు. ఆర్‌బీఐ ప్రతినిధి సమక్షంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ చేపడతామని ఆ తర్వాత వాటి ఫొటోలు, బరువు, నాణ్యత తదితర వివరాలతో డిజిటల్ కేటలాగ్ రూపొందిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.



రత్నభాండాగారాన్ని తెరిచే సమయంలో ఆలయం వద్ద భక్తులు

రత్నభాండాగారం వద్ద స్పృహ తప్పిన పూరీ ఎస్పీ?

పూరీ పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా శ్రీమందిరంలోని రత్నభాండాగారం తలుపు వద్ద స్పృహ తప్పి పడిపోయారని, ఖజానాలోకి ప్రవేశించిన సభ్యుల్లో ఒకరైన డాక్టర్ సీబీకే మొహంతి ఎస్పీకి చికిత్స అందించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మిశ్రా ఖండించారు. ఆలయ సింహద్వారం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త!

పోలీసు, నిఘా, దర్యాప్తు సంస్థల పేరిట నకిలీ ఈమెయిళ్లు

- వాటికి స్పందించవద్దు
- 1930కి ఫోన్ చేసి

తెలియజేయాలి: కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, జూలై 14: పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల పేరిట సైబర్ మోసగాళ్లు నకిలీ ఈ మెయిళ్లు, నోటీసులు పంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోంశాఖకు చెందిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్' (ఐ4సీ) ప్రజలకు సూచించింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు.. అవి నిజంగానే ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా? అని తెలుసుకోవటానికి ఆ వెబ్‌సైట్ చివర gov.in ఉందా అనేది చూడాలని పేర్కొంది. అలాగే, సదరు మెయిల్‌లో ప్రస్తావించిన అధికారుల గురించి సమాచారం, వారి వివరాలను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ విభాగానికి ఫోన్ చేసి ఈ మెయిల్ గురించి తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు ఐ4సీ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చినప్పుడు, ఇతరత్రా సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు అప్రమత్తమై www.cybercrime.gov.in కు, లేదా సైబర్ క్రైం హెల్ప్ నంబరు 1930కి సమాచారం అందించాలని తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనూ కేంద్ర ఆర్థికశాఖ ఒక సూచన జారీ చేసింది. ఢిల్లీ పోలీసు సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ సైబర్ సెల్ పేర్లతో, ఆయా సంస్థల లోగోలతో, అధికారుల సంతకాలతపంపిస్తున్నారని పేర్కొంది. దీంతో పాటు ఒక అటాచ్‌మెంట్ కూడా పంపుతున్నారని.. చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ పోర్నోగ్రఫీ వంటి నేరాలకు పాల్పడ్డావంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు వాటికి ప్రతిస్పందించవద్దని, వీటి గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్‌లో పని చేసే ఉద్యోగులకు కూడా గత వారం అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చాయి.

పర్యవేక్షణ లేదు.. ఫిట్‌నెస్ లేవు

- కాలం చెల్లిన వాటికే మెరుగులు
- చోద్యంచూస్తున్న ఆర్టీఏ అధికారులు
- ఇదీ జిల్లాలో స్కూల్ బస్సుల పరిస్థితి



ఇచ్ఛాపురం

జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు నిర్వహిస్తున్న బస్సులు ఫిట్‌నెస్‌పై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. ప్రధానంగా ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డెక్కుతున్నా ఆర్టీఏ అధికారులు పర్యవేక్షించడంలేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన బస్సులకు మెరుగులు దిద్ది విద్యార్థులను తరలిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో ఫిట్‌నెస్‌ను పర్యవేక్షించాల్సిన, నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయాల్సిన ఆర్టీఏ అధికారులు చోద్యంచూస్తున్నారు. జిల్లాలో పాత బస్సులకు పైపై మెరుగులు దిద్ది నడుపుతున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ప్రైవేటు యాజమాన్యాలు నడిపే బస్సులు ఫిటెనెస్‌తో ఉన్నాయో లేదానన్న సందేహాలు ఉన్నాయి. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దాదాపు 196 బస్సులకు గాను శ్రీకాకుళం ఎంవీఐ పరిధిలో 55, టెక్కలిలో 100, పలాస-కాశీబుగ్గలో మూడు, ఇచ్ఛాపురం పరిధిలో ఐదు మండలాల్లో 38 ప్రైవేటు స్కూల్ బస్సులు నిర్వహిస్తున్నారు. వీటిలో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు పాఠశాలలకు రాకపోకలకు సాగిస్తున్నారు. పాఠశాలల బస్సులకు సంబంధించి రవాణాశాఖ అధికారులకు ఫిట్‌నెస్ పత్రాలు సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించుకోవాల్సిఉంది. అయితే పలు యాజ మాన్యాలు బస్సుల ఫిట్‌నెస్‌పై ఆసక్తి చూపడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా యాజమాన్యాలు అన్ని రకాల పత్రాలు సమర్పించి ఫిట్‌నెస్ చేయించుకుని బస్సులు రోడ్డుపైకి రావాలని రవాణాశాఖ అధికారులు ఆదేశించిన విషయం విదితమే.



ఇవీ నిబంధనలు..

- పాఠశాల బస్సులకు సామర్థ్య పరీక్షల కోసం రవాణాశాఖ కార్యాలయంలో అధికారులతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, బీమా, పొల్యూషన్, పత్రాలు డ్రైవర్‌కు సంబంధించి లైసెన్స్ అందించాలి.
- బస్సు కిటికీలను ఇరువైపులా నాలుగు వరుసల ఇనుప రక్షణ కంచెను ఏర్పాటుచేయాలి. బస్సులో ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉండాలి. బస్సు నడిపే డ్రైవర్ వయసు 60 ఏళ్లలోపే ఉండాలి. డ్రైవర్‌కు ఐదేళ్ల హెవీ వాహనం నడిపిన అనుభవం ఉండాలి.డ్రైవర్‌తో పాటు విద్యార్థులు బస్సు ఎక్కినప్పుడు దిగినప్పుడు చూసుకునేందుకు సహాయకుడు ఉండాలి. పిల్లల బస్సుకు ఎక్కేందుకు వీలుగా అదనపు మెట్లు ఏర్పాటు చేయాలి. బస్సులో ఏదైనా అగ్ని ప్రమాదం సంబవిస్తే మంటలు ఆర్పేందుకు వీలుగా అగ్ని ప్రమాద రక్షణ సిలిండర్ ఉండాలి.
- మోటార్ వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్, పన్ను చెల్లింపు రశీదుతో పాటు డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ ఫొటోను తప్పనిసరిగా బస్సులో ఏర్పాటు చేయాలి.
- ప్రతి నెలా ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి. బస్సులకు తప్పనిసరిగా పసుపు రంగు వేయాలి. పాఠశాల పేరు, కనిపించేలా ఉండాలి. డ్రైవర్లు మూడేళ్లకోసారి బీపీ, సుగర్, పరీక్షలు చేయించుకోవాలి. బస్సు కిటికీలకు మధ్య రెండు లోహపు కడ్డీలు అమర్చాలి.
- గత ఏడాది ఎఫ్‌సీ పత్రాలు తీసుకున్న బస్సులకు ఈనెలాఖరుకు గడువు ముగియనుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆ బస్సులు రోడ్డుపైకి రావడానికి వీల్లేదు. అలాగే 15 ఏళ్ల దాటిన స్కూల్ బస్సుల్లో విద్యార్థులను తరలించరాదు.

నిబంధనలు బేఖాతర్..

- సాధారణంగా వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు ప్రారంభానికి నెల రోజులు ముందే బస్సులకు ఫిటెనెస్ పరీక్షలు చేయించుకోవాలి. అయినా ఇప్పటి వరకు చాలా విద్యా సంస్థల యాజమాన్యాలు బస్సులకు పూర్తి స్థాయి ఫిట్‌నెస్ చేయించుకోకుండా కాలయాపన చేస్తున్నాయి.
- స్కూల్ బస్ డ్రైవర్లు ఎంపికలో యాజమాన్యాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. శిక్షణ పొంది, ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్లకు ఎక్కువ వేతనం చెల్లించాల్సి వస్తుందని 60 ఏళ్ళ నిండిన వారిని డ్రైవర్గా నియమిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.
- బస్సుల్లో 25 నుంచి 40 వరకు సిటింగ్ సామర్థ్యం ఉండగా 40 నుంచి 60 మంది వరకు విద్యార్థులను ఎక్కిస్తున్నారు.
- చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను స్కూళ్లకు ఆటోల్లో పంపిస్తున్నారు. వాటిల్లో కూడా డ్రైవర్లు పరిమితికి మించి 10 నుంచి 15 మంది విద్యార్థులను, ఆటో ముందుభాగంలో రెండువైపులా పదుల సంఖ్యలో స్కూల్ బ్యాగులను వేలాడదీసి తీసుకెళ్తున్నారు.
- పాఠశాలలు పునఃప్రారంభానికి నెలరోజుల ముందు నుంచే విద్యాసంస్థల నిర్వాహకులు వాహనాలను కండీషన్ పరిశీలించి, మరమ్మతుచేసి రవాణా శాఖ నుంచి మరోఏడాది చెల్లుబాటుకు ఎఫ్‌సీ తీసుకోవాలి. కాని ఇప్పటివరకు కేవలం 80 శాతం బస్సులు మాత్రమే ఎఫ్‌సీలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఆ బస్సులు నడిపితే సీజ్‌చేస్తాం..

ఫిట్‌నెస్ లేకుండా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బస్సులు నడిపితే బస్సు సీజ్ చేయడంతో పాటు చర్యలు తీసుకుంటామని ఇచ్ఛాపురం ఎంవీఐ అనీల్ హెచ్చరించారు. ఇచ్ఛాపురం ఎంవీఐ పరిధిలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాల్లో 35 ప్రైవేటు పాఠశాల బస్సులు ఉన్నాయని చెప్పారు. ఇందులో 30 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలుచేసినట్లు తెలిపారు. మిగిలిన ఐదు బస్సులకు ఈ నెలాఖరులోగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఫిట్‌నెస్ చేయించకుండా బస్సులు రోడ్డుపైకి వస్తే సీజ్‌చేస్తామని తెలిపారు.

హామీలను నెరవేర్చడమే లక్ష్యం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణమూర్తి



మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి

ఎల్.ఎన్.పేట: ఎన్నికల ముందుఇచ్చిన హామీలను నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీజిల్లా అధ్యక్షుడు కె.వెంకట రమణమూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని డొంకల బడవంజలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కక్కటిగా నెర్చడంలో భాగంగా పెంచిన ఫించన్లను అమలుచేసినట్లు తెలిపారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణానికి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, నాయకులుఎస్.కిషోర్‌కుమార్, వి.ఆనందరావు,జి.మోహనరావు, టి.అప్పన్న, జి.రాము, ఎం.జగదీశ్వరరావు, జి. వాసు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్‌కు టెక్కలి డిపో ఉద్యోగులు

మెళియాపుట్టి(టెక్కలి): ఆల్‌ఇండియా బస్‌ట్రాన్స్‌పోర్ట్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్‌కు విజయనగరం జోన్ నుంచి పాల్గొనే జట్టులో టెక్కలి ఆర్టీసీ డిపో నుంచి పలువురు ఎంపికయ్యారని డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. సెప్టెంబరులో నిర్వహించనున్న ఈపోటీలకు టెక్కలి డిపో నుంచి 400 మీటర్ల రన్నింగ్‌కు కండక్టర్ బి.శ్రీరామ్మూర్తి, మహిళా విభాగం నుంచి కండక్టర్ ఆర్. విజయకుమారి లాంగ్‌జంప్, 100మీటర్ల రన్నింగ్, జావెలిన్‌త్రో పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. జోనల్ స్థాయిలో ఎంపికైన వారికి ఆగస్టు మూడో తేదీన రాష్ట్రస్థాయి ఎంపిక విజయవాడలో జరుగుతుందని తెలిపారు. ఎంపికైన శ్రీరామ్మూర్తి, విజయకుమారిలకు అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

గుంజుమెట్టపై వర్షాల కోసం పూజలు



వరద పాయసం తయారు చేస్తున్న రైతులు

జలుమూరు: మండలంలోని గుంజుమెట్టపై పంగవానిపేట, చల్లవానిపేట, లింగాలవలస రైతులు ఆదివారం వర్షాల కోసం పూజలు చేశారు.పురోహితుడు అక్కాజోష్యుల కృష్ణబాబు ఆధ్వర్యంలో గుంజుమెట్టపై వరదపాయసం పోశారు. ప్రతిఏటా వరదపాయం ఆనవాయితీగా వరుణి దేవునికి అర్పిస్తున్నట్లు రైతులు తెలిపారు.

షెడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

జలుమూరు: యాదవుల కోసం 90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మాణానికి నిధులు మంజూరుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్ణయం తీసుకోవడంపై యాదవ సాధికార జిల్లాకన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని టెక్కలిపాడులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గొర్రెలు,మేకలు ఉంచుకోడానికి ఒక్కోషెడ్ నిర్మాణానికి 2.30 లక్షలు రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ యాదవుల సంఘం కన్వీనర్ తాన్ని అసిరినాయుడు, ప్రధాన కార్యదర్శి బొమ్మాళి బలరాం యాద్, నాలుగు మండలాలకు చెందిన కన్వీనర్లు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నోరు అదుపులో పెట్టుకోవాలి

- వైసీపీ నేతకు కొత్తూరు మండల టీడీపీ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న నిర్వాసిత గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు

పాతపట్నం/కొత్తూరు: వైసీపీ నాయకుడు బూర్లె శ్రీను నోరు అదుపులో పెట్టుకోకుంటే రానున్నరోజుల్లో తగిన గుణపాఠం తప్పదని కొత్తూరు మండల టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఆయన చేసిన తప్పులకు శిక్ష అనుభవించకతప్పదని తెలిపారు.ఆదివారం కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్-1లో నిర్వాసితగ్రామ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. అర్హులైన నిర్వాసితుల పొట్టకొట్టి ప్రజాధనాన్ని లూటీ చేసిన దుర్మార్గుడు బూర్లె శ్రీనని తెలిపారు.బూర్లె శ్రీనును ప్రభుత్వకార్యాలయాలకు రాకుండా అడ్డుకోవాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ భూములను తప్పుడుపట్టాలు చేసుకొన్న అవినీతి పరుడు తెలిపారు. అప్పట్లో కోట్లాది రూపాయల ప్రభుత్వధనాన్ని అవినీతికిపాల్పడి దోచుకున్నాడని ఆరోపించారు. నిరుపేద నిర్వాసితుల పొట్టకొట్టి ప్యాకేజీలు దోచుకున్న గజదొంగ అని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాసితగ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు అడపాక శంకరరావు, కొయిలాపు శ్రీనివాసరావు, బర్రి గోవింద రావు, రౌతు అనంతరావు, అగతముడి మాధవరావు, మాతల గాంధీ, ఆరుబోలు దశరధ, వాలిపిల్లి వెంకట రమణ, పెద్దిన అమర్, చోడవరపు రాము, కృష్ణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు గరిమెళ్ల జయంతి

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారంలో జాతీయగేయ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ 131వ జయంతిని గరిమెళ్ల జయంతి కమిటీ నాయకులు సోమవారం నిర్వహించనున్నారు. ఈమేరకు గరిమెళ్లకళాశాల వద్ద నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాడాన రాజు, వేదుల రామకృష్ణశర్మ, దుబ్బక కోటేశ్వరరావు, ఇలపండ గణపతిరావు తెలిపారు. జయంతి సభకు ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే కేఏఎల్ఎన్ భుక్త హాజరుకానున్నారన్నారు.

నేడు మారు రథయాత్ర

పలాస రూరల్:మండలంలోని తర్లాకోట, రెంటికోటల్లో సోమవారం మారు రథయాత్రకు సర్వంసిద్ధం చేశారు.గతఆదివారం జరిగిన గుండిచారథయాత్రతో స్వామివారు ప్రధాన గుడి నుంచి రథంపై ఆశీనులై గుండిచా మందిరానికిచేరి వారంరోజులపాటు అందుకున్నారు. దశమిని పురస్కరించుకొని జరిగే మారు రథయాత్రతో స్వామివారు పూజలందుకుని రథారోహుడై తిరిగి శ్రీమందిరానికి చేరుకోనున్నట్లు తర్లాకోట అర్చకులు తెలిపారు.

రేపు మండల సమావేశం

మెళియాపుట్టి(టెక్కలి):టెక్కలి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పోలాకి:ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని ప్రవచకులు కంచుమోజు రామమోహనరావుస్వామి తెలిపారు. ఆదివారం చింతాడపేట స్వామిరామయోగిసేవాశ్రమంలోనిర్వహించిన సత్సంగ సమావేశంలో మాట్లాడారు.కార్యక్రమంలో రామయోగిసేవాశ్రమఅధ్యక్షులు బమ్మిడి విశ్వనాథం, నారాయణస్వామి, బి.అప్పలనాయుడు, అనంతస్వామి, సింగుపురం లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

గొనసపేటలో సత్సంగం

నరసన్న పేట: గొనసపేట జ్ఞానాందఆశ్రమంలో ఆదివారం సతంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త బైపల్లి భీమారావు మాట్లాడుతూ మానవుడు భగవంతుని సూచించిన మార్గాన్ని అనుచరించి జ్ఞానం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అల్లు రామయ్య, అప్పారావు, రమణ, ఎస్వీ రాజు పాల్గొన్నారు.

40 మంది రక్తదానం

పలాస: స్థానిక సూదికొండకాలనీలో టెక్కలి జిల్లా ఆసుపత్రి వైద్యాధికారి సునీత ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో40 రక్తదానం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు శివకుమార్, అశోక్‌కుమార్, అప్పన్న, సురేష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

బైపల్లిలో జనసేన జెండా ఆవిష్కరణ

వజ్రపుకొత్తూరు: మండలంలోని బైపల్లిలో జనసేన కార్యకర్తలు ఈ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బైపల్లి జనసేన అధ్యక్షులు మద్దు వినయ్, పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి వి.దుర్గారావు, లండ శివ, టి.వినయ్, టి.సునీల్ పాల్గొన్నారు.

యోగాతో రోగనిరోధక శక్తి

నరసన్న పేట: యోగాతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆర్ట్‌ఆఫ్ లివింగ్ సభ్యుడు కింజరాపు అమ్మన్నాయుడు తెలిపారు. ఆదివారం గుండువిల్లిపేటలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు అమ్మన్నాయుడును సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బగ్గు సుగుణ, యోగా శిక్షకులు సందీప్, సురేంద్ర, శిమ్మ చంద్రశేఖర్, యాళ్ల వేణుగోపాలరావు, శిమ్మ జగన్నాథం పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

నరసన్న పేట:హిందూ ధర్మం కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత సంఘచాలక్ కృష్ణంరాజు పిలుపునిచ్చారు. ఆదివారం నరసన్నపేటలో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఖండ్ ప్రముఖ్ పద్మనాభం, ఖండ సేవాప్రముఖ్ కేఎల్ఎన్ మూర్తి, కేవీ రామచంద్రరావు, కేఎన్‌బీ గుప్త, నానాజీ గాడ్డే, జామి కామేశ్వరరావు, పోగోటి రాజారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణంరాజు

క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండాలి

- వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



సంతబొమ్మాళి: మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఆశా కార్యకర్తలు

సంతబొమ్మాళి(కోటబొమ్మాళి): క్షేత్రస్థాయిలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఆదివారం కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శకంగా రైతులకు సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పొలంపిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతులకు పొలంబడి, భూసార పరీక్షలు, గ్రామస్థాయిలో విత్తనోత్పత్తి, రాయితీపై విత్తనాలు సరఫరా, వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రీయ వ్యవసాయం తదితర శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులకు ఎరువులు, విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

- **సంతబొమ్మాళి(కోటబొమ్మాళి):** తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు, రెవెన్యూ శాఖలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంత్రి అచ్చెన్నాయుడును నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో కలిశారు.
- **హిరమండలం:**వంశధార నిర్వాసితులకు ఉపాధి పనులు కల్పించాలని జడ్పీటీసీ చిట్టిబాబు కోరారు.ఈ మేరకు మంత్రి అచెన్నాంనా యుడుకు నిమ్మడలో కలిసి వినతిపత్రం అందజేశారు.

కొత్తమ్మతల్లికి న్యాయాధికారి పూజలు

సంతబొమ్మాళి (కోటబొమ్మాళి): కోటబొమ్మాళి కొత్తమ్మతల్లిని నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్‌న్యాయాధికారి చందక హరిప్రియ ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమె పూజలు చేశారు. అమ్మవారికి రూ.26వేల విలువగల 263 గ్రాములు వెండి పంచపాత్ర,ఉద్దరిని ఈవో వాకచర్ల రాధాకృష్ణకు అందజేశారు.



అమ్మవారికి వెండి వస్తువులు అందజేస్తున్న హరిప్రియ

ఆలయాలను పరిరక్షించుకోవాలి

- సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి



మాట్లాడుతున్న శ్రీనివాసానందస్వామి

మెళియాపుట్టి(టెక్కలి)ఆలయాలను పరిరక్షించుకోవాలని సాదుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి తెలిపారు.ఆదివారం రావివలస ఎండలమల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందు ధర్మం పరిరక్షణకుఅందరూ పాటుపడాలన్నారు.కార్యక్రమంలో హిందుదేవాలయాల పరిరక్షణ జిల్లాఅధ్యక్షుడు రాంప్రసాద్, హరిచంద్ర, కొండలరావు పాల్గొన్నారు.

రాధాకాంత సాగరంలో జలహారతి



టెక్కలి మండలం బూరగాంలో జలహారతి ఇస్తున్న టీడీపీ నాయకులు

మెళియాపుట్టి(టెక్కలి): మండలంలోని బూరగాం సమీపంలో గల రాధాకాంత సాగరంలో టీడీపీ ఆదివారం జలహారతిఇచ్చారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో 58ఆర్ పరిధిలోని బూరగాం రాధాకాంత చెరువుకు వంశధార జలాలు చేరాయి.దీంతో ఆనందం వ్యక్తం చేస్తూ జలహారతి ఇచ్చారు. కార్యక్రమంలో మళ్ల బాలకృష్ణ, వంశధార ఈఈ శేఖర్‌బాబు, శివరాంపురం సర్పంచ్ సబ్బి జానకిరాం పాల్గొన్నారు.

మేఘవరం కాలువకు నీరు విడుదల

సంతబొమ్మాళి(కోటబొమ్మాళి):మేఘవరం కాలువకు సాగునీటిని పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ కింజరాపు హరిప్రసాద్ కోటబొమ్మాళి మండలంలోని తిలారు వద్ద ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, వంశధార డీఈ బగ్గు సత్యన్నారాయణ, పట్ట సింహచలం, అచ్చెన్న, పల్లి రాంబాబు పాల్గొన్నారు.

బోగస్ పింఛన్లపై ఫిర్యాదు

జలుమూరు:వెలుసోదలో బోగస్ పింఛన్లు పొందుతున్న వారిపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.ఐదుగురు బోగస్ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నట్లు ఫిర్యాదుఅందిందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి నివేదిక సమర్పించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.



టెక్కలిలో జీవో ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



హరిపురం: గెజిట్ పత్రాలను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గెజిట్ నోటిఫికేషన్ రద్దుచేయాలి

మెళియాపుట్టి(టెక్కలి): సీపీఎస్ ఉద్యోగులను గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)లోకి తీసుకువస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ రద్దుచేయాలని యూటీఎఫ్ మండలశాఖ నిరసన తెలిపింది. ఈ మేరకు ఆదివారం జీవో-54 ప్రతులను దహనం చేశారు.కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు కె.దాలయ్య, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు గణపతిరావు, వైకుంఠరావు,గౌరవాధ్యక్షులు కుమారస్వామి, పి.ధర్మారావు, కె.ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

- **హరిపురం:** జీపీఎస్ అమలు కోసం రాజపత్రం విడుదల చేయడంతో హరిపురంలో యూటీఎఫ్ నాయకులు జీపీఎస్ గెజిట్ కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు,నాయకులు కంచరాన మాధవరావు, జగదీష్, ఈశ్వరరావు, సోమేశ్వరరావు, కొండలరావు, దుర్గాప్రసాద్, కూర్మారావు పాల్గొన్నారు.

జల్లపల్లిలో కొత్తమ్మతల్లి సంబరం



ముర్రాటలతో కొత్తమ్మతల్లికి చల్లదనం చేయడానికి వెళ్తున్న మహిళలు

నందిగాం:మండలంలోని జల్లపల్లిలో కొత్తమ్మతల్లి సంబరాలను ఆదివారం నిర్వహించారు.ప్రతిఏటాఆషాడపౌర్ణమి ముందు ఆదివారం ఈ సంబరం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో మహిళలు ముర్రాటలతో వీధుల్లో మేళతాళాలు, ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి కొత్తమ్మతల్లికి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పలాసరూరల్:మొక్కలతోనే పర్యావరణపరిరక్షణ సాధ్యమని సంఘసేవకుడు చిన్నాచారి తెలిపారు.మండలంలోని లొద్దభద్ర, అల్లుకోల, తర్లాకోట జంక్షన్, బెండిఫ్లైఓవర్ ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలను రోడ్డుకు పక్కగా నాటారు.

పల్లిసారధిలో ఆవేటి వారాలు

వజ్రపుకొత్తూరు:మండలం లోని పల్లిసారధిలో ఆవేటి వారాలు ఆదివారం నిర్వహించారు.ఏటా పొలాల్లో విత్తనాలు వేసే ముందు గ్రామదేవతలకు చల్లద నంచేసే కార్యక్రమంలో భాగంగా ఆవేటి వారాలు నిర్వహిస్తారు. ప్రసాదాలతో ఉన్న అమ్మవారి రథాలను మేళతాళాలతో గుడు లకు తీసుకువెళ్లి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారు ఊరేగింపులో మహిళలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


శివకుమార్ (ఫైల్)

మెళియాపుట్టి(టెక్కలి): టెక్కలి మండలంలోని బొప్పాయిపురం వద్ద జాతీయరహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన బియ్యాని శివకుమార్(50) మృతి చెం దాడు. రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో హైవే సిబ్బంది టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మెళియాపుట్టి(టెక్కలి): టెక్కలి మండలంలోని ఒలియాసాగరం గ్రామానికి చెందిన మాలతి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. కుటుంబ కలహాలతో మాలతి ఇబ్బందిపడుతోంది. నిత్యం తన సోదరుడు, మేనళ్లుల్లు కొడుతుండడంతో విసిగిపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.అపస్మారక స్థితిలో ఉన్న మాలతిని టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడలో ఆదివారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు. వీరి నుంచి రూ.2600ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బాగుపడిన సాగునీటి కాలువ


కాలువలో పూడిక, గుర్రపు డెక్క తొలగించిన దృశ్యం

గార: గార వద్ద కళింగపట్నం, వమరవెల్లి తదితర గ్రామాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే కాలువలో పూడిక, గుర్రపు డెక్క ఆదివారం తొలగించారు. దీంతో కాలువ రూపురేఖలు మారిపోయాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కాలువలు ఇలా.. సాగునీరు ఎలా కథనంపై ఎమ్మెల్యే గొండు శంకర్ స్పందించారు. ఈ మేరకు కాలువ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో జలవనరులు శాఖ డీఈఈ అనిల్‌కుమార్, ఏఈ కావ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు పర్యవేక్షణలో కాలువను అభివృద్ధి చేశారు. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రమదానంతో గ్రోయిన్‌కు మరమ్మతులు


గ్రోయిన్‌ను బాగుచేసిన రైతులు

సోంపేట: బారువ, జింకిభద్ర, బెంకిలి గ్రామాల్లోని 3వేల ఎకరాలకు సాగునీరందించే బారువ గ్రోయిన్‌ను రైతులు ఆదివారం శ్రమదానంతో బాగుచేశారు. గ్రోయిన్ నుంచి నీరు వృథాగా పోకుండా ఇసుక బస్తాలు అడ్డుగా వేశారు. బారువ రైతుసంఘం అధ్యక్షుడు సానా కామేష్ ఆధ్వర్యంలో రైతులు శ్రమదానం చేశారు.

దేశాయ్ కాలువ పరిశీలన

బూర్జ: మండలంలోని అల్లెన గ్రామంలో ఉన్న దేశాయ్ సాగునీటి కాలువను ఇరిగేషన్ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ కుమార్ కాలువను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నివేదికను ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు అందిస్తామన్నారు. ఈ కాలువ ద్వారా అల్లెన పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి రాంజీ, టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు వారాడ రాంబాబు, రైతులు, అంజనేయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు

సోంపేట: జీపీఎస్‌పై ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని పీఆర్‌టీయూ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన 12పీఆర్‌సీని కనీసం ఐఆర్ అయిన ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దాలిబందు, చంద్రశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పాఠశాల వద్ద పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

గార: కె.మత్స్యలేశంలోని కోకావారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకచోట కలిసి సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

గురుపూర్ణిమ వేడుకలు

కంచిలి: స్థానిక శ్రీకృష్ణ ఆలయంలో ఆర్ఎస్ఎస్ సోంపేట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆలయ ప్రాంగణంలో గురుపూర్ణిమ విశిష్టతను తెలిసే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


భరతమాత చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

విభిన్న రూపాల్లో జగన్నాథుడు

రథయాత్రలో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం జగన్నాథస్వామి విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకాకుళం మొండేటివీధి, ఇలిసిపురం, టెక్కలి, సోంపేటలో కృష్ణావతారంలో, గుజరాతీపేటలో సత్యనారాయణస్వామిగా, పలాసలో బలరాముడిగా, నరసన్నపేటలో జగన్మోహినిగా, పాతపట్నంలో శ్రీరాముడిగా, సారవకోట అవలింగిలో బాల రామునిగా, ఇచ్ఛాపురంలో అనంత శయన అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం బహుడా(తిరుగు) రథయాత్ర నిర్వహించేందుకు అన్నిచోట్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురంలో..


శ్రీకాకుళం ఇలిసిపురంలో..


మెళియాపుట్టి (టెక్కలి)లో..


పలాసలో..


నరసన్నపేటలో..


పాతపట్నంలో..


జలుమూరు (సారవకోట)లో..


సోంపేటలో..

వైసీపీ నాయకుల అక్రమాలపై విచారణ చేయాలి

● టీడీపీ మండల అధ్యక్షుడు రాజు


మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు రాజు

ఆమదాలవలస: మండలంలో గత ప్రభుత్వ పాలనలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు, కనుగులవలస సర్పంచ్ నూక సూరప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కనుగులవలస గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కానీ, వైసీపీ నాయకులు విమర్శించడం తగదన్నారు. వీరి మాటలు దొంగలే దొంగ దొంగ అని అరిచినట్టు ఉందన్నారు. కనుగులవలసలో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చాడని, దీనికి బదులుగా ఆయనకు ఆమదాలవలస పట్టణ సమీపంలో లక్షల రూపాయల విలువచేసే పది సెంట్ల స్థలాన్ని వైసీపీ ప్రభుత్వం ఇచ్చిందని ఆరోపించారు. అలాంటప్పుడు స్థలదాతగా ఆయన పేరును ఆర్‌బీకేకు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఈ కేంద్రానికి వెళ్లేందుకు తమ గ్రామస్థులు, రైతులు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోనే గోదామును ఏర్పాటు చేసి పార్టీలకతీతంగా రైతులకు ఎరువులు అందిస్తామని తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని అన్నారు.

తెలుగు భాషలో అవధానం మణిమకుటం

● ముగిసిన ద్విశతావధానం


మాట్లాడుతున్న అవధాని అపర్ణ

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాషలో అవధానం సాహిత్యప్రక్రియలో మణిమకుటం అని అవధాని బులుసు అపర్ణ అన్నారు. నగరంలో సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ద్విశతావధానం కార్యక్రమం ఆదివారం ముగిసింది. అవధానులు పేరి రవికుమార్ (విశాఖపట్నం), దొబ్బల ప్రభాకరశర్మ(కొవ్వూరు) మాట్లాడుతూ.. ఇలాంటి అవధానాలు, కవి సమ్మేళనాలతో తెలుగు భాష బతికే ఉంటుందని అన్నారు. 50 సమస్య పూరణలు, 50 దత్త పదులు, 50 వర్ణనలపై ప్రాశ్నికులు అడిగిన ప్రశ్నలకు అవధాని బులుసు అపర్ణ పద్యరూపంలో విరామం ఇవ్వకుండా మొత్తం పూరణం చేశారు. అనంతరం ఆమెతో పాటు 216 మంది ప్రాశ్నికులను సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, ఇప్పిలి శంకర్ శర్మ, పులఖండం శ్రీనివాసరావు, కొమ్మనా సురేష్, మండవల్లి రవి, గుత్తు చిన్నారావు, వీవీఆర్.మూర్తి, నీరజా సుబ్రహ్మణ్యం, నక్క శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత అభిరామ్

● ముగిసిన జిల్లాస్థాయి పోటీలు


డబుల్స్ విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఆదివారంతో ముగిసింది. బ్యాడ్మింటన్ మెన్ చాంపియన్‌గా ఎ.అభిరామ్, రన్నరప్‌గా కె.సాయి కుమార్ నిలిచారు. డబుల్స్ విభాగంలో విన్నర్‌గా ఎం.అభిరామ్, కె.సాయికుమార్, రన్నరప్‌గా పిజి.సాయిదత్త, భరద్వాజ్ చౌదరి నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు కిల్లంశెట్టి సాగర్ అందజేశారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు భైరి దామోదర్, ఎం.అశోక్ కుమార్, టి.జయరామ్, కేఎస్ఎం.శైలాని, రత్నాజీ. కె.తారకేశ్వరరావు, జి.అనిల్‌కుమార్, సీఈవో ఎస్.సూరిబాబు, డీఎస్ఏ శిక్షకులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హాకీ బలోపేతానికి కృషి

● సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో హాకీ బలోపేతానికి కృషిచేస్తామని జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు పంచిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదని, అనతి కాలంలోనే హాకీ క్రీడను మరింత ప్రోత్సహిస్తూ రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అంతకు ముందు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా పి.అప్పలనాయుడు, కార్యదర్శిగా జరుగుళ్ల రమేష్, ట్రెజరర్‌గా పంచిరెడ్డి గురునాథం, ఉపాధ్యక్షులుగా సీహెచ్.విజయభాస్కర్, ఎస్.మధు, వై.మనోజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా టి.శ్రీనివాసరావు, బి.ఈశ్వర్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వై.కృష్ణవేణి, కె.బిందు రవిసాగర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హాకీ సంఘం పరిశీలకులు జి.రాంబాబు (అనకాపల్లి), జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు కె.హరికృష్ణ, అల్లు రమేష్ హాజరయ్యారు.

రాష్ట్రాభివృద్ధిలో జర్నలిస్టులు భాగస్వాములు కావాలి

అరసవల్లి: రాష్ట్ర అభివృద్ధిలో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విలువలను పాటించాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులును ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

లావేరు: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మహామాధురి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం గురుగుబిల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.తోటయ్య దొర, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లంక నారాయణరావు, రక్తదాన శిబిరం నిర్వాహకుడు జాన్, గురుగుబిల్లి సర్పంచ్ బాడిత లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ


బహుమతులతో నీరజ శిష్య బృందం


శ్రీకాకుళం కల్చరల్: విశాఖపట్నంలోని కళాభారతిలో ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 35వ జాతీయస్థాయి నృత్య పోటీల్లో జిల్లా కళాకారులు ప్రతిభకనబరిచారు. నాట్య రవళి మ్యూజిక్ అకాడమి(విశాఖ) ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. కూచిపూడి, భరతనాట్యంలో శ్రీకాకుళం అభినయ నృత్య కళానికేతన్‌కు చెందిన నీరజ శిష్య బృందం కె.సింధు శ్రీహర్షిత ప్రథమ బహుమతి, సెమీ క్లాసికల్, ఫోక్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. జూనియర్స్ విభాగంలో డి.విశిష్ట, వి.నవ్యశ్రీ, శ్రీనిధి, భరతనాట్యంలో వైష్ణవి, అక్షయ, యశస్విని, ఊర్మిళ, ఉషశ్రీ కృతీక్ష, యామిని, లోకేశ్వరి, ప్రదీతి, వైష్ణవి, క్రీరజ్ తదితరులు ప్రతిభ కనపరిచి బహుమతులు సాధించారు. ఏయూ ప్రొఫెసర్ రామారావు, ప్రముఖ నాట్యాచార్య నతరాజపరమేశ్వరన్, తులసీదాస్, నాట్యరవళి అధ్యక్షుడు ఉమ్మడి మహేష్ బాబు, తదితరులు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


హెల్మెట్ వినియోగంపై యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ఇచ్ఛాపురం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని స్వేచ్ఛ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కూన విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం కేదారంపురం గ్రామంలో ఆరోగ్యం, విద్య, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్ రాజు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, గంజాయి, గుట్కా వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సాయిసుధీర్, అనిల్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ ప్రత్యూష, సెక్రటరీ అనిల్, కేదారిపురం సర్పంచ్, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హరిశ్చంద్ర, సాయి కృష్ణ, విశ్వనాథం, రవికుమార్, ప్రవీణ్ కుమారి, దివ్య తదితరులు పాల్గొన్నారు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కౌలురైతు నాయకులు

అరసవల్లి: భూయజమాని అనుమతి లేకపోయినా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కౌలు రైతులకు రైతు భరోసా, పంటల నష్టపరిహారం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు.

పాత పింఛను వర్తింపజేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో-57ను అమలు చేసి ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని వర్తింపజేయాలని 2003 డీఎస్సీ ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ఆమదాలవలస: వంశధార, నాగావళి నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని కొత్తవలస వద్ద రాత్రి సమయాల్లో నాగావళి నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారని కొందరు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ స్పందించి.. నదిలోకి ఎటువంటి వాహనాలు వెళ్లకుండా ఎక్స్‌వేటర్‌తో ఆ మార్గంలో గొయ్యి తీశారు. ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక రవాణా చేసుకోవచ్చునని, దీనికి పంచాయతీ కార్యదర్శి అనుమతి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.శిరీష, వీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా తులసమ్మ సంబరం..

ఇచ్ఛాపురం: ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని పట్టణ ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు పట్టణంలోని పలు వీధులకు చెందిన భక్తులు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. మట్టి కుండలతో తీసుకెళ్లిన పానకాలు, పసుపు నీటితో అమ్మవారికి అభిషేకాలు చేశారు.

చిత్రకారుడికి సన్మానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మణిపాత్రుని క్రియేట్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రేఖా చిత్రకారుడు బూర్జ కోటేశ్వరరావు (పలాస-కాశీబుగ్గ)ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంసీఏ అధినేత నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కోటేశ్వరరావు చిత్రకారులకు మార్గదర్శి అని, రేఖా చిత్రాల్లో ఆయనది అందివేసిన చేయని కొనియాడారు. అనంతరం అకాడమిలో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మెలకువలు నేర్పారు. కార్యక్రమంలో ఆర్.మూర్తి, రాణి నాయుడు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

కంచిలి: మండలంలోని పెద్ద అంపురం గ్రామానికి చెందిన ఎదూరు నారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతో కలసి ఎంఎస్‌పల్లి పాఠశాలలో చదువుకున్న స్నేహితులు రూ.40,700 నారాయణ కుమార్తె జెస్సీ పేరు మీద సుకన్య యోజనలో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. ఈ పత్రాలను కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నారాయణ స్నేహితులు, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కించపరిచే వ్యాఖ్యలు సరికాదు

ఆమదాలవలస: సామాజిక మాధ్యమాల్లో పార్వతీపురానికి చెందిన పైల దాసు బ్రాహ్మణ జాతిని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యాలను మండల బ్రాహ్మణ సేవా సంఘం ఖండించింది. ఈ మేరకు ఆమదాలవలసలో నిర్వహించిన సమావేశంలో సంఘ సభ్యులు మాట్లాడారు. బ్రాహ్మణులను వేశ్య పుత్రులని దాసు అభివర్ణించడం తగదన్నారు. ఈ మాటలతో తాము తీవ్రవేదనకు గురయ్యామన్నారు. ఇటువంటి నీచమైన పదజాలంతో బ్రాహ్మణ జాతిని నిదించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. వెంటనే దాసు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడు బలిజేపల్లి వెంకటరమణమూర్తి, కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షుడు బలివాడ చిట్టిపంతులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో ఉత్తమ సత్ఫలితాలు సాధించాం


మాట్లాడుతున్న సంఘం కార్యదర్శి హసన్‌రాజ

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా క్రికెట్ చరిత్రలో ఈ ఏడాది ఉత్తమ సత్ఫలితాలను సాధించామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి హసన్ రాజ పేర్కొన్నారు. స్థానిక ఓ ప్రైవేట్‌హోటల్‌లో ఆదివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏర్పాటు చేశారు. అండర్-19, 23 జోన్ జట్లకు జిల్లా నుంచి ఐదుగురు చొప్పున ఎంపికైనట్లు చెప్పారు. ఏపీఎల్‌లో కూడా జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారులు ఉన్నారన్నారు. జిల్లాలో మూడు మైదానాల కోసం ఎంవోయూలు కుదుర్చుకుంటు న్నామన్నారు. ఈ సమావేశంలో సంఘం ట్రెజరర్ శైలాని, డా.సువ్వారి రవికుమార్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.4.64లక్షలు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.4,64,608 ఆదాయం లభించిందని ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,10,500, విరాళాల రూపంలో రూ.75,113 ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,70,995 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. స్వామివారిని చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యుడు గురజాల జగన్మోహన్‌నాయుడు దర్శించుకున్నారు. ఆయనకు స్వామివారి జ్ఞాపికను ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి అందజేశారు.

గరిమెళ్లకు నివాళి

అరసవల్లి: స్థానిక ప్రెస్ క్లబ్‌లో గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని ఆదివారం నిర్వహించారు. గరిమెళ్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిక్కోలు జలసాధన సమితి చైర్మన్ దుప్పల రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.